# మగవాడి బ్రతుకూ అరిటాకులాంటిదే

విజయ్:- "వెన్నెల రాత్రి! ఇది కన్నెల హృదయాలను కదిలించే కమ్మని రాత్రి.

కుమార్:- వధూవరుల యెదల్లో వలపులు చిందించే పసిడివెన్నెల రాత్రి.

విజయ్.- మగువల మనసుల్లో మల్లెలు వికసించే మధురమైన రాత్రి!

కుమార్:- వడుచుతనం పరవళ్ళు త్రొక్కే యవ్వనులకది పండగరాత్రి."

"యూ .షటప్" దాదాపు అరిచినట్టుగా అన్నాడు శ్రీనాథ్ చేతిలోని సిగరెట్టు పీకని ఆఖరిసారిగా పీల్చి 'యాస్ ట్రే'లో పడేస్తూ... ఆ కేకకి ఉలిక్కి పడ్డారు కుమార్, విజయ్‌లు శ్రీనాథ్ చిరాకుకి అర్థం తెలీక.

"ఏరా? మా కవిత్వం బాగులేదా?" అన్నాడు కుమార్. "వెన్నెల రాత్రి పిలుపు, కన్నెపిల్ల తలుపు కమ్మని కవిత్వానికి మత్తెక్కవలసింది

పోయి పెర్రివాడిలా అలా అరిచావేమిట్రా" గేలిచేస్తున్నట్టడిగాడు విజయ్

"కన్నె పిల్ల, పలవు... అహ్హహ్హహ్హ... అంతా అబద్ధం-నాటకం— .. ఆడదంటే, అక్షరాలా బ్రహ్మరాక్షసి... భూతం... దెయ్యం.'' పళ్ళు పట పటా కొరుకుతూన్న శ్రీనాథ్ కేసి చూస్తూ మూగ వాళ్ళలా గుడ్లప్పగించారు కుమార్, విజయ్‌లు.

కుమార్, విజయ్, శ్రీనాథ్ ముగ్గురూ ఒక మొగ పిల్లల కాలేజీలో లెక్చరర్లు ముగ్గురూ ఇంకా బ్రహ్మచారులే ఒక్క చోటతిని ఒక్క రూములో వుంటూ- ఒకే కాలేజీలో పని చేసుకుంటూ గడపటమేకాకుండా, ముగ్గురూ సినిమాహాలు దగ్గరా, కాఫీ హోటల్ దగ్గరా కూడా కలిసే కనబడడం వల్ల వీళ్ళని అందరూ త్రిమూర్తులు అంటారు. ఒకేమాటా, ఒకే బాటా అయిన త్రిమూర్తులకి భేదాభిప్రాయాలొచ్చేదల్లా ఒక్క విషయంలోనే. ఆడపిల్లల పేరెత్తితేచాలు, మండి పడతాడు శ్రీనాథ్ ముక్కంటిలా ఉగ్రుడైపోయి తాండవం చేసినంత పని చేస్తాడు. సరదాగా ఆడపిల్లల గురించి జోక్స్ వేసుకునే కుమార్ విజయ్‌లు అది చూసి, నోరుమూసుకుంటారు ఆడపిల్ల కనబడితే. ఏదో పెద్దపులిని చూసినట్టు ఆమడదూరంపారిపోతాడు శ్రీనాథ్. ఎంత ఆలోచించినా శ్రీనాథ్ మనస్తత్వం ఏమిటో అర్థం కాలేదు కుమార్‌కి విజయ్‌కి.

"వీడు పెళ్ళిచేసుకుంటే. పెళ్ళాన్ని వాడింట్లోంచి బయటికి రాని య్యడు కాబోలురా షీవిల్, బి యె కుక్ నాట్...ఎ...వైఫ్''

''వీడితో కాపురం చెయ్యలేక.విడాకులిచ్చి..ఉడాయిస్తుంది, రెండో రోజే ఆ ఇల్లాలు.'' ఇవీ కామెంట్స్ వీళ్ళ కామెంట్స్ వింటే ఒళ్ళు మండి పోయింది శ్రీనాథ్‌కి. ఇద్దర్నీ పీకనులిమి అవతల పడెయ్యాలన్నంత కోపం

వచ్చినా, ఏమీ చెయ్యలేక అలిగి అవతలికి వెళ్ళిపోయాడు. ఆరోజునుంచీ, శ్రీనాథ్‌లోని ఈ ప్రవర్తనకు కారణం ఏమైవుంటుందా. పరిశోధన చెయ్యాలని నిశ్చయించుకున్న కుమార్. విజయ్‌లకి ఈరోజున అవకాశం దొరికింది. ఆడజాతిమీద అంత ద్వేషం దేనికో నిలవేసి అడిగారు. గత్యంతరం లేక శ్రీనాథ్ చెప్పడం మొదలెట్టాడు.

"అనొక చిన్నపల్లెటూరు పేరు ఏటికొప్పాక. జిల్లా విశాఖపట్టణం. అక్కడ నాన్నగారు. గవర్నమెంటు స్కూల్లో బడిపంతులు ఉద్యోగం చేస్తూ కాలంగడుపుతున్నారు. నాకు ఒక్క తమ్ముడూ ఇద్దరు చెల్లెళ్ళు వున్నారు. మా పెద్ద చెల్లెలు సరోజ స్నేహితురాలె ఆ ఊరి కరణం గారమ్మాయిరాణి పూర్తి పేరు సుధారాణి. సరోజా అంతస్థు, కులం, గోత్రం ఈభేదాలేమీ మనసుకి పడకపోవటంవే వారి స్నేహం ముడిపడిపోవడంవల్ల రాణి అస్తమానం మాఇంట్లోనేవుండేది. సరోజతో కబురుచెబుతూ. నేనూ. సరోజ నేర్పించినట్టే ఆ అమ్మాయినీ ఆట పట్టించేవాణ్ణి గంటలు గంటలు వాదించుకునే వాళ్ళం అనేక విషయాలమీద మరెన్నో గంటలు పేకాడుకునే వాళ్ళం. గంటలు నిమిషాల్లా దొర్లిపోయేవి మాఇద్దరికీ ఒక రోజు రాణి కనబడకపోతే మనసు గిలగిల్లాడిపోయేది ఒక్కరోజునన్ను చూడకపోయినా చేపపిల్లలా కొట్టుకుపోయేది రాణి. అంతవరకూ తెలీలేదు మాకు యవ్వనపు తొలిపొంగులోని ఆకాంక్ష, ఆకర్షణ దానికి కారణమని. ఒకరోజున రాణి నాతో ఏదో రహస్యంగా మాట్లాడాలనీ, వాళ్ళ కొబ్బరితోట దగ్గర సాయంత్రం అయిదింటికి కలుసుకోమనిచెప్పి, చీటిరాసి, సరోజ చూడకుండా నా చేతిలో పెట్టి వెళ్ళిపోయింది. అంతకుముందే రాణి రూపం నా కళ్ళలోనూ, రాణి ప్రేమ నా గుండెల్లోనూ నిండిపోవడంవల్ల, రాణి ఉత్తరానికి ఉబ్బి

తబ్బిబ్బై రాణిని కలుసుకునే శుభముహూర్తం కోసం ఎదురుచూస్తూ క్షణమో యుగంలాగా గడిపాను రాణిని నా భార్యామణిగా ఊహించుకుని, మా భావి జీవితాన్ని పూలపడవలా, పాలకడలిలా, కమ్మనితియ్యని భావాలతో అల్లుకుంటూ, తలపుల పొదరింట్లో రోజంతా గడిపేశాను. సాయంత్రం నా కున్నవాటిలో మంచి వనుకున్నవి పాంటూ, షర్టూ వేసుకుని, నీటుగా తల దువ్వుకొని, కొబ్బరి తోటలకేసి నడిచాను. వనకన్యలా నుంచున్నంది రాణి. రోజూ మాట్లాడే రాణే అయినా, ఏదో భయం, పిరికితనం గుండెలు కొట్టుకున్నాయి. ఆకాశం, సూర్యుడు, కొబ్బరిచెట్లు, పిల్లగాలి అన్నీకలిసి భయపెడుతున్నట్లనిపించింది. కానీ, రాణి నవ్వు కొండంత ధైర్యాన్నిచ్చింది. ఉత్సాహంతో ముందుకు నడిచాను.

"వస్తావో రావోననుకున్నా" రాణిలోని నునుసిగ్గు కొత్తగా అనిపించింది.

కన్నార్పకుండా ఆమెకేసి చూస్తూండిపోయాను.

"నీతో ఎన్నో మాట్లాడాలి"

ఆమె మాటల్లోని మాధుర్యం నా హృదయంలో వెయ్యి వీణలు మీటినట్లయ్యింది.

"ఏయ్...నిన్నే...మాట్లాడవేం?"

ఉలిక్కి పడ్డాను. "అఁ...ఆదే...దేనిగురించి?" పకాపకా నవ్వింది రాణి, పిచ్చిగా చూస్తున్న నన్నుచూసి.

"ఇంకా దేనిగురించి? మనగురించే. నేనంటే నీకిష్టమా?"

ఆ ప్రశ్నకు నా ఒళ్ళు ఝల్లుమంది. ఎంత ఇష్టమో నా గుండెల మీద తన చెవులానించి వినిపించాలనిపించింది. మనసు మాట్లాడే మూగ భాష. అలా చెయ్యలేక "నువ్వంటే నాకెంతో ఇష్టం" అన్నాను అచ్చంగా తెలుగు సినిమా హీరోలాగా.

"అయితే నన్ను పెళ్ళిచేసుకోవడానికి నీకేం అభ్యంతరం లేదుగా!" సిగ్గు బరువుతో తల వంగిపోతోందేమో, నేలచూపులు చూస్తూ అంది.

"ఏమిటా పిచ్చి ప్రశ్న? అందాలరాశివి, ఐశ్వర్యవంతురాలివి. అన్నింటినీ మించి సుగుణవతివి, మనసిచ్చినదానివి నిన్ను పొందే అర్హత నాకుందా లేదా అని ఆలోచించుకోవాలి. అన్నింటిలోనూ నీకన్నా తక్కువే ముఖ్యంగా మీ అంతస్తూ, మా అంతస్తూ..."

"చాల్లే... అవేవీ అడ్డు రాకుండా నేను చూసుకుంటాను" అంది.

అంతలోనే అక్కడికెలా వొచ్చారో కరణంగారు మమ్మల్నిద్దర్నీ మార్చి మార్చి చూశారు. ఆ చూపులు గునపాల్లా గుచ్చుకున్నయ్ గుండెల్లో. నిప్పుకణాల్లా ఒళ్ళంతా కాల్చేస్తున్నయ్.

ఏదో చెప్పబోయాను.

'నోర్ముయ్' అన్నారు చెంప ఛెళ్ళుమనిపిస్తూ. కళ్ళు బైర్లుకమ్మాయి. తమాయించుకుని కళ్ళు తెరిచేసరికల్లా చుట్టూ మూగిపోయారు జనం. కరణంగారి పక్కన మేకపిల్లలా నుంచుంది రాణి.

"తన్నండి వెధవని బాగా కొవ్వెక్కినట్టుంది. సినిమాలో హీరోనను

కున్నాడు కాబోలు, అమ్మాయిలవెంట తిరగడానికి" ఒక కంఠం పలికింది వెంటనే ఒక దెబ్బ పడింది.

"ఎన్ని గుండెలు, బోడి బడిపంతులు కొడుకు, కరణంగారి అమ్మాయి వెనకే పడ్డాడూ... ఒళ్ళు పొగరు కాకపోతే..." మరోకంఠం మాట్లాడింది మరో దెబ్బ చుర్రుమంది.

"నేనేం వెంటబడలేదు. తనే నన్ను రమ్మంది" అన్నాను ఎలాగో గొంతు పెగుల్చుకొని.

"ఏం కూశావురా పక్షీ! నా కూతురు నిన్ను రమ్మందా రాస్కెల్" అంటూ కాలితో డొక్కలో ఒక్క తన్నుతన్నాడు కరణం.

"కావాలంటే అడగండి" అన్నాను సమయానికి ఆ ఉత్తరం తన దగ్గర లేకుండా పోయినందుకు బాధపడుతూ.

"ఏమే ..నిజమా?" ప్రశ్నించాడు కరణం కాదు గర్జించాడు. ఆ గర్జనలోంచి మెల్లగా వినిపించాయి మాటలు "లేదు...నేను ..రమ్మనలేదు ...అసలు...నాకేం...తె..లీ..దు..." గుండె ఆగిపోయింది నాకు కరణం గారి దెబ్బలకన్నా రాజి మాటలు మరింత బాధపెట్టాయి.

"ఒక ఆడపిల్లమెడ ఆభరణాలు వేస్తావట్రా దౌర్భాగ్యుడా?..."

"సిగ్గూ ఎగ్గూ లేదట్రా గాడిదా .."

"అమాయకురాలి జీవితంలో నిప్పులు పోద్దామను కున్నావా,

రాస్కెల్" మాటలూ తన్నులూ ఒకదానితో ఒకటి పోటీ పడ్డాయి.

ఎక్కణ్నుంచొచ్చారో నాన్నగారు, కన్నీళ్ళతో కరణంగారి కాళ్ళు కడిగారు.

"నీ మొహంచూసి ఒదిలేస్తున్నానోయ్ పంతులూ జాగ్రత్త, ఆడ పిల్లల జీవితం అరిటాకులాంటిదని చెప్పు వాళ్ళ నల్లిపాలుచేసి చెలగాటం ఆడుకోవద్దని చెప్పు" అంటూ రాజిని వెంటబెట్టుకుని వెళ్ళిపోయాడాయన. మెల్లిమెల్లిగా ఒక్కరొక్కరూ జారుకున్నారు, ఆడపిల్లల దీనస్థితులను చర్చించుకుంటూ.

"ఏవరా భ్రష్టుడా...ఒక ఆడపిల్లని బజారు కెక్కించిన ఘనత నాకు దక్కించావ్. ప్రయోజకుడవయ్యావురా...నాకు...చాలా గర్వంగా వుంది" నాన్నగారి ఒక్కొక్క మాటా చెప్పుచ్చుకు కొట్టినట్టుంది.

"నాన్నా...మీరూ నమ్ముతున్నారా..."

లేదురా...కళ్ళతో చూసింది భ్రమ అనుకుంటున్నాను."

"నాన్నగారూ...నిజంగా నన్నక్కడికి రమ్మని రాజే ఆ వుత్తరం రాసింది."

"ఇంకా ఎందుకురా బుకాయిస్తావ్, ఏ ఆడపిల్లా మొగాడికలా వుత్తరం రాయదురా అందులోనూ పెళ్ళికావలసిన పిల్ల. సంప్రదాయ కుటుంబంలోని పిల్ల"

నాలో ఆవేశం ముంచుకొచ్చింది. "కన్నకొడుకుని కూడా నమ్మనంత నమ్మకం ఆ పిల్లమీద ఎలా వచ్చింది మీకు" అన్నాను.

"నోరుమూయ్యరా కుంకా! ఇది తరతరాల అనుభవంరా, ఏదీ ఆ వుత్తరం చూపించు" అన్నారాయన కాగాలు సూయతూ. సరోజ చూస్తుందేమోనన్న భయంతో ఉత్తరం చింపేశానన్న విషయం అప్పటికిగానీ గుర్తుకురాలేదు నాకు. ఆ మాటే చెప్పాను.

"చాలా బావుందిరా, నువ్వు చెప్పేది మొట్టమొదటి ప్రణయలేఖ చింపేశానంటావ్! నన్ను నమ్మమంటావ్?"

"నాన్నా"

"ఛీ...నన్నలా పిలవకు ఒక స్త్రీలోలుడికి తండ్రినని చెప్పుకోవడం కన్న చావుమేలు. పట్నంలో చదువుతున్నావ్. ఇదన్నమాట నువ్వు చదివే చదువు ఇలా ఎంతమందిని ఆడించావో, ఏడిపించావో..."

నా నిస్సహాయస్థితికి నా మీద నాకే అసహ్యమేసింది ఆరోజున. మగాణ్నై పుట్టినందుకు మొదటిసారిగా నా మీద నాకే తెగజాలికలిగింది, అసహ్యం వేసింది.

ఇంటికెళ్ళాక, ఎంతసేపు ఆ రాత్రి ఏడుస్తూ కూర్చున్నానో ఇప్పటికీ చెప్పలేను. ఇంట్లో వాళ్ళంతా నన్నో దోషిని చూసినట్టు చూశారు. సరోజ కూడా అసహ్యించుకుంది అమ్మ మాట్లాణ్ణేలేదు. మర్నాడు కాసేపు అలా ఊళ్ళోకెళ్ళేసరికి, ఆడవాళ్ళందరూ ఒక రౌడీనిచూసి ఝడుసుకున్నట్లు పారిపోయేరు, మగవాళ్ళు ఒక పురుగును చూసినట్టుచూసేరు. ఆ చూపులు, ఆ ప్రవర్తనా నా గుండెల్ని చీల్చేశాయి.

సెలవులయి పోకుండానే ఇల్లొదిలి, విశాఖపట్నం వచ్చేశాను. దాదాపు ఒక్క సంవత్సరం ఇంట్లో వాళ్ళెవ్వరూ నాతో సరిగ్గా మాట్లాడలేదు. అడపా దడపా ఇంటికెళ్ళినా. సరోజ పెళ్ళికి కట్నం సమస్య కారణమయినా, సరోజమాత్రం "ఒక రౌడీకి చెల్లెలి నయినందుకు ఆనాడు రాణికి నువ్వు అన్యాయం చేశావు కనకనే నన్నీ రోజున ఇలా ఏడుస్తున్నా" నంటుంది. నాన్నగారు మనోవ్యాధితో మంచం పట్టారు. ఏ సమస్యల్నీ తీర్చలేక, ఎవరికీ నిజాన్ని చెప్పలేక నాలో నేనే కుమిలి పోతున్నాను. మొన్నీమధ్యే రాణికి పెళ్ళయిందని తెలిసింది అత్తవారింటికి వెళ్ళిపోయింది. కానీ నా మొహాన పడ్డ ముద్రమాత్రం అలాగే మిగిలిపోయింది.

ఇప్పుడు చెప్పండి. ఈ సమాజం ఆడదానిమాట నమ్మినంతగా, మగవాడిమాట ఛస్తేనమ్మదు: అందుకేనూ, పదిమందిలోనూ కన్నీరు పెట్టగలిగితే చాలు. ఇక వాడి పని గోవింద. కన్నతండ్రి కావొచ్చు కట్టుకున్న మొగుడు కావచ్చు మరెవ్వడైనా కావొచ్చు"

o o o o o o

శ్రీనాథ్ చెప్పే మాటలన్నీ ఒక కథలాగా వింటూ కూర్చున్నారు కుమార్, విజయ్‌లు శ్రీనాథ్ మీద ఎనలేని జాలికలిగింది. మనసు వికలమై పోయింది. "ఒరేయ్...ఆడదాని బతుకు అరిటాకులాంటిదంటారు కాని, మగవాడి బతుకూ అరిటాకులాంటిదేరా" అన్నాడు కుమార్.

"కనీసం ఆడదానిపట్ల సానుభూతి చూపుతుందిలోకం. మొగాడి మీద అదీ వుండదు'' అన్నాడు విజయ్.

గడియారం పన్నెండు కొట్టింది. బయట వెన్నెలరాత్రి చల్లదనం కన్న, గుండెలోపలి వెచ్చదనం తాలూకు వేడిమి హెచ్చనిపించింది. వెన్నెలని చూస్తే చిరాకు పుట్టింది. దీపం తీసేసి మాట్లాడకుండా పడుకున్నారు ముగ్గురూ మగవాళ్ళ కష్టాలగురించి మననం చేసుకుంటూ.